# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

## విశాఖపట్నం కేంద్రం

## జాతీయ వార్తలు

తేదీ: 15-12-2025 సమయం : రాత్రి 8గం. 30ని.లు

## ముఖ్యాంశాలు

- ❖ దేశ ఐక్యతకు విశేష కృషి చేసిన ఉక్కు మనిషి సర్దార్ వల్లభ్ భాయ్ పటేల్ 75వ వర్ధంతి సందర్భంగా ఉపరాష్ట్రపతి సీ పీ రాధాకృష్ణన్, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నివాళులర్పించారు.
- ❖ మూడు దేశాల పర్యటనలో భాగంగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ జోర్డాన్ రాజధాని అమ్మాన్ చేరుకున్నారు.
- ❖ గత 11 ఏళ్లలో దేశంలో సౌర విద్యుత్ సామర్థ్యం 46 శాతం పెరిగిందని కేంద్రమంత్రి పీయూష్ గోయల్ వెల్లడించారు.
- ❖ విమానయాన ఛార్జీల పర్యవేక్షణను మరింత కఠినతరం చేయనున్నామని కేంద్రమంత్రి కె. రామ్మోహన్ నాయుడు తెలిపారు.
- ❖ ఉత్తరాది రాష్ట్రాల్లో దట్టమైన పొగమంచు కారణంగా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని భారత వాతావరణ విభాగం (ఐఎండీ) హెచ్చరించింది.

========================

దేశ ఐక్యతకు విశేష కృషి చేసిన ఉక్కు మనిషి సర్దార్ వల్లభ్ భాయ్ పటేల్ 75వ వర్ధంతి సందర్భంగా ఉపరాష్ట్రపతి సీ పీ రాధాకృష్ణన్ సహా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, కేంద్ర హోం మంత్రి అమిత్ షా ఆయనకు ఘనంగా నివాళులర్పించారు. ఉపరాష్ట్రపతి సీ పీ రాధాకృష్ణన్ సామాజిక మాధ్యమం వేదికగా సర్దార్ పటేల్ సేవలను స్మరించుకున్నారు. స్వాతంత్ర్యనంతరం విడివిడిగా ఉన్న వందలాది సంస్థానాలను భారత్‌లో విలీనం చేయడంలో, దేశ ఏకీకరణలో పటేల్ కీలక పాత్ర పోషించారని కొనియాడారు. అఖిల భారత సర్వీసుల వ్యవస్థకు ఆయన పునాది వేయడం ద్వారా పరిపాలనా యంత్రాంగం బలోపేతమైందని తెలిపారు. దేశాన్ని ఒకే తాటిపైకి తీసుకురావడానికి సర్దార్ పటేల్ తన జీవితాన్ని అంకితం చేశారని, అఖండ, బలమైన భారత్ నిర్మాణానికి ఆయన చేసిన కృషిని దేశం ఎప్పటికీ గుర్తుంచుకుంటుందని నరేంద్ర మోదీ సామాజిక మాధ్యమంలో పోస్ట్ చేశారు. కేంద్ర హోం మంత్రి అమిత్ షా వల్లభ్ భాయ్ పటేల్ కు నివాళులర్పిస్తూ… దేశ తొలి హోంమంత్రిగా, మాతృభూమి భద్రత, అంతర్గత స్థిరత్వం, శాంతి స్థాపనను తన జీవిత లక్ష్యాలుగా పెట్టుకున్నారని పేర్కొన్నారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = =

మూడు దేశాల పర్యటనలో భాగంగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ కొద్దిసేపటి క్రితం జోర్డాన్ రాజధాని అమ్మాన్ చేరుకున్నారు. అమ్మాన్ విమానాశ్రయంలో ఆ దేశ ప్రధానమంత్రి డాక్టర్ జాఫర్ హసన్ ప్రధానికి స్వాగతం పలికారు. జోర్డాన్ ప్రధాని జాఫర్ హసన్ తనకు విమానాశ్రయంలో ఇచ్చిన ఆత్మీయ స్వాగతానికి కృతజ్ఞతలు తెలుపుతూ.. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సోషల్ మీడియా వేదిక 'ఎక్స్'లో పోస్ట్ చేశారు. ఈ పర్యటన రెండు దేశాల మధ్య ద్వైపాక్షిక సంబంధాలను బలోపేతం చేస్తుందని విశ్వసిస్తున్నాని నరేంద్ర మోదీ పేర్కొన్నారు. జోర్డాన్ రాజు అబ్దుల్లా-II ఇబ్న్ అల్ హుస్సేన్ ఆహ్వానం మేరకు భారత ప్రధానమంత్రి ప్రస్తుతం జోర్డాన్‌లో పూర్తి స్థాయి ద్వైపాక్షిక పర్యటన చేస్తున్నారు. 37 ఏళ్ల సుదీర్ఘ విరామం తర్వాత భారత ప్రధాని జోర్డాన్‌లో పూర్తి స్థాయి ద్వైపాక్షిక పర్యటన చేయడం ఇదే మొదటిసారి. భారత్, జోర్డాన్ మధ్య దౌత్య సంబంధాలు ఏర్పడి 75 ఏళ్లు పూర్తవుతున్న సందర్భంగా ప్రధాని పర్యటన జరుగుతుండటం విశేషం. ఈ పర్యటనలో భాగంగా నరేంద్ర మోదీ జోర్డాన్ రాజు అబ్దుల్లా, ప్రధాని జాఫర్ హసన్‌లతో చర్చలు జరుపుతారు. అమ్మాన్ నుంచి నరేంద్ర మోదీ రేపు ఇథియోపియా రాజధాని అడిస్ అబాబాకు వెళ్తారు. అక్కడ ఇథియోపియా ప్రధాని డాక్టర్ అబియ్ అహ్మద్ అలీతో చర్చలు జరిపి, ప్రవాస భారతీయలను ఉద్దేశించి ప్రసంగిస్తారు. బుధవారం ఒమన్ రాజధాని మస్కట్ కు నరేంద్ర మోదీ చేరుకుంటారు. మస్కట్‌లో ఆయన ఒమన్ సుల్తాన్‌తో చర్చలు జరిపి, అక్కడి ప్రవాస భారతీయల సమావేశంలో పాల్గొంటారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = =

గత 11 ఏళ్లలో దేశంలో సౌర విద్యుత్ సామర్థ్యం 46 శాతం పెరిగిందని కేంద్ర వాణిజ్యం, పరిశ్రమల శాఖ మంత్రి పీయూష్ గోయల్ తెలిపారు. మంత్రి ఈరోజు ఢిల్లీలో మీడియాతో మాట్లాడుతూ.. భారత్ ఇప్పుడు ప్రపంచంలో నాలుగో అతిపెద్ద బొగ్గు శుద్ధి కేంద్రంగా ఎదిగిందని తెలిపారు. గత సంవత్సరం దేశంలో ఒక బిలియన్ టన్నులకుపైగా బొగ్గు ఉత్పత్తి జరిగిందని, దిగుమతులు 8 శాతం తగ్గాయని వివరించారు. దేశంలో పవన శక్తి సామర్థ్యం ఇప్పుడు 53 గిగావాట్లకు పెరిగిందన్నారు. గత 11 సంవత్సరాల్లో ఎనర్జీ రంగంలో విప్లవాత్మక మార్పులు చోటుచేసుకున్నాయని, దీనికి ప్రభుత్వ విధానాలే కారణమని పీయూష్ గోయల్ పేర్కొంటూ…

(వాయిస్ 26 సెకన్లు)

విరామం

= = = = = = = = = = = = = = = = = = = = = = = =

కేంద్ర ప్రధాన సమాచార కమిషనర్‌గా రిటైర్డ్ ఐఏఎస్ అధికారి రాజ్‌కుమార్ గోయల్ ఈ రోజు ప్రమాణ స్వీకారం చేశారు. న్యూఢిల్లీలోని రాష్ట్రపతి భవన్‌లో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఆయనతో ప్రమాణ స్వీకారం చేయించారు. గోయల్, కేంద్ర న్యాయ మంత్రిత్వ శాఖ పరిధిలోని న్యాయ విభాగం కార్యదర్శిగా విధులు నిర్వహించి, ఈ ఏడాది ఆగస్టు 31న పదవీ విరమణ చేశారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = =

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రభుత్వం అవలంబిస్తున్న సంస్కరించు, అమలుచేయు, మార్పు తీసుకురావాడం (Reform, Perform, Transform) సూత్రాల ఆధారంగా దేశం అభివృద్ధి వైపు వేగంగా పయనిస్తోందని కేంద్ర న్యాయ శాఖ సహాయ మంత్రి అర్జున్ రామ్ మేఘ్వాల్ తెలిపారు. ఎన్నికల సంస్కరణలపై రాజ్యసభలో ఈరోజు జరిగిన చర్చలో ఆయన మాట్లాడుతూ… నకిలీ ఓటర్లను తొలగించేందుకు జరుగుతున్న SIR ప్రక్రియను బలంగా సమర్థించారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = =

వచ్చే ఏడాది హజ్ యాత్రకు ప్రైవేట్‌గా వెళ్లాలనుకునే భారతీయ యాత్రికులు జనవరి 15వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని కేంద్ర మైనారిటీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ సూచించింది. కేవలం అధీకృత హజ్ గ్రూప్ ఆర్గనైజర్లు (HGOs) ద్వారా మాత్రమే బుకింగ్స్ చేసుకోవాలని స్పష్టం చేసింది. సౌదీ అరేబియాలోని హజ్, ఉమ్రా మంత్రిత్వ శాఖ జారీ చేసిన మార్గదర్శకాల దృష్ట్యా.. కేంద్ర మైనారిటీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ ఈ మేరకు కీలక ఆదేశాలు జారీ చేసింది.

==========================

దేశంలో విమానయాన ఛార్జీల పర్యవేక్షణను మరింత కఠినతరం చేయనున్నామని పౌర విమానయాన శాఖ మంత్రి కె. రామ్మోహన్ నాయుడు తెలిపారు. టారిఫ్ మానిటరింగ్ యూనిట్ ను మరింత బలోపేతం చేస్తామని ఆయన స్పష్టం చేశారు. రాజ్యసభలో ఈరోజు ప్రశ్నోత్తరాల సమయంలో సభ్యులు అడిగిన అనుబంధ ప్రశ్నలకు మంత్రి సమాధానమిచ్చారు. విమాన ఛార్జీలు పెరిగే అవకాశం ఉన్నప్పుడల్లా.. మంత్రిత్వ శాఖ తక్షణమే చర్యలు తీసుకుంటుందని తెలిపారు.

==========================

దేశంలో ఉన్నత విద్యారంగంలో సమూల మార్పులు తీసుకురావడానికి ఉద్దేశించిన `వికసిత్ భారత్ శిక్షా అధిష్ఠాన్ బిల్లు- 2025`ను లోతైన పరిశీలన కోసం పార్లమెంటు ఉభయ సభల సంయుక్త కమిటీకి పంపాలని కేంద్రం నిర్ణయించింది. ఈ బిల్లును లోక్‌సభలో ప్రవేశపెట్టిన వెంటనే జేపీసీకి సిఫార్సు చేశారు. కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ ఈ బిల్లును లోక్‌సభలో ఈరోజు ప్రవేశపెట్టారు.

==========================

గత 24 గంటలుగా ఉత్తర భారతంలో వాతావరణం చలి, దట్టమైన పొగమంచుతో నిండి ఉందని భారత వాతావరణ విభాగం (IMD) తెలిపింది. ముఖ్యంగా ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేశ్ రాష్ట్రాల్లో చాలా ప్రాంతాల్లో విజిబిలిటీ సున్నా మీటర్లకు పడిపోయిందని పేర్కొంది. ఈనెల 16, 17వ తేదీల్లో ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేశ్‌లలో ఉదయం వేళల్లో దట్టమైన పొగమంచు కొనసాగే అవకాశం ఉందని ఐఎండీ అంచనా వేసింది. పంజాబ్, ఈశాన్య భారత ప్రాంతాలలో ఈ నెలాఖరు వరకు ఇదే పరిస్థితి ఉండే అవకాశం ఉందని, వాయువ్య భారతదేశంలో కనిష్ఠ ఉష్ణోగ్రతలు క్రమంగా పడిపోయే అవకాశం వుందని తెలిపింది. ఉత్తరాది రాష్ట్రాల్లో దట్టమైన పొగమంచు కారణంగా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఐఎండీ హెచ్చరించింది.

==========================

భారత స్క్వాష్ జట్టు తొలిసారిగా స్క్వాష్ వరల్డ్ కప్ గెలుచుకున్న సందర్భంగా రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, ఉపరాష్ట్రపతి సి.పి. రాధాకృష్ణన్, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ జట్టుకు శుభాకాంక్షలు తెలిపారు. స్క్వాష్ ప్రపంచ కప్‌లో భారత జట్టు అద్భుతమైన ప్రదర్శన కనబరిచి దేశానికి గర్వకారణంగా నిలిచిందని రాష్ట్రపతి సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు. భారత స్క్వాష్ జట్టుకు ఉజ్వల భవిష్యత్ ఉండాలని ద్రౌపది ముర్ము ఆకాంక్షించారు. ఈ చారిత్రక విజయం దేశానికి గర్వకారణమని, ఇది ఆటగాళ్ల అసాధారణ నైపుణ్యం, అంకితభావం, పట్టుదలకు నిదర్శనమని ఉపరాష్ట్రపతి సి.పి. రాధాకృష్ణన్ పేర్కొన్నారు.

==========================

68వ జాతీయ షూటింగ్ ఛాంపియన్‌షిప్ పోటీల్లో ఒలింపిక్ పతక విజేత మను భాకర్, సిమ్రన్ ప్రీత్ కౌర్ బ్రార్ స్వర్ణ పతకాలను గెలుచుకున్నారు. న్యూఢిల్లీలోని డాక్టర్ కర్ణి సింగ్ షూటింగ్ రేంజ్‌లో పోటీలు ఈరోజు జరిగాయి. సీనియర్ మహిళల 25 మీటర్ల స్పోర్ట్స్ పిస్టల్ ఈవెంట్‌లో మను భాకర్ విజేతగా నిలిచింది. జూనియర్ మహిళల 25 మీటర్ల స్పోర్ట్స్ పిస్టల్ ఫైనల్‌లో సిమ్రన్‌ప్రీత్ కౌర్ స్వర్ణ పతకాన్ని గెలుచుకుంది.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = =

= = = = = = = = = = = = = = = = = = = = = = = = =